
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
గురువారం 12 సెప్టెంబరు 2024



వైభవంగా
వినాయక నవరాత్రోత్సవాలు - 8లో..

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి - 8లో..



పల్లెపోరుకు కసరత్తు

- ఓటరు జాబితా ప్రక్రియకు ఏర్పాట్లు
- రేపు ముసాయిదా జాబితా విడుదల
- 21 వరకు అభ్యంతరాలు
- 28న వార్డుల వారీగా తుది జాబితా
- మూడు విడతల్లో పోలింగ్‌కు అవకాశం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

గ్రామ పంచాయతీ ఎన్నికల పోరుకు ఎన్నికల కమిషన్ కసరత్తు మొదలు పెట్టింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా తయారీ షెడ్యూల్ విడుదల కావాల్సి ఉంది. వర్షాల కారణంగా ఈ నెల 6న ఓటరు జాబితా ముసాయిదా విడుదల కావాల్సి ఉండగా మార్పులు చేసింది. ఈనెల 13న ఓటర్ల ముసాయిదా విడుదలకు సిద్ధం చేశారు. 14 నుంచి 21 వరకు అభ్యంతరాల స్వీకరణ, 18న జిల్లా స్థాయిలో, 19న మండల స్థాయిలో ఓటరుజాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. 28న వార్డుల వారీగా తుది ఓటరు జాబితా వెల్లడించనుంది. దీంతో అధికారులు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఒక్కో వార్డులో 650 మంది ఓటర్లు ఉండే విధంగా జాబితాలను తయారు చేస్తున్నారు. అంతకంటే ఎక్కువగా ఓటర్లు ఉంటే అదనంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా జాబితాలు సిద్ధం చేస్తున్నారు. దీంతోపాటు ఒక పోలింగ్ బూత్‌లో 200 మంది ఉండే విధంగా చూస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు అధికార సిబ్బంది లెక్కలు కూడా తేల్చారు. ఒక బూత్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారి ఉంటారు. 201 నుంచి 400 మంది ఓటర్లు ఉన్న బూత్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 600 మంది ఉండే పోలింగ్ బూత్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారితోపాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించే విధంగా వివరాలను సిద్ధం చేశారు.

మూడు విడతల్లో పోలింగ్‌కు అవకాశం

రాష్ట్ర ఎన్నికల సంఘం 2019 సంవత్సరంలో నిర్వహించిన ఎన్నికల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించారు. ఈ సారి కూడా మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. పంచాయతీ ఎన్నికల తరువాత మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. సర్పంచ్ ఎన్నికలకు పార్టీ గుర్తులు లేకపోయినా పార్టీల మద్దతుతోనే బరిలో నిలవనున్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలకు పార్టీ గుర్తులు కూడా ఉంటాయి. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు 2240 వార్డులు ఉన్నాయి. వార్డుల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా పూర్తయిన వెంటనే ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రారంభం కానుండడంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం మొదలైంది. ఆశావహుల్లో రిజర్వేషన్లపై కొంత అయోమయం నెలకొంది. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రెండు విడతలుగా ఒకే రిజర్వేషన్ ఉండే విధంగా రూపొందించారు. 2018లో రూపొందించిన సవరణల్లో 34 శాతం నుంచి 23 శాతానికి బీసీ రిజర్వేషన్ తగ్గించారు. దీనిపై హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికల్లో బీసీలకు 23 శాతం, ఎస్సీ ఎస్టీలకు 21 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. గరిష్ఠ పరిమితి 50 శాతంలో 44 శాతం పోగా మిగిలిన 6 శాతం బీసీలకే కేటాయిస్తారని భావిస్తున్నారు. దీని ద్వారా రిజర్వేషన్ల ప్రక్రియ మారుతుందని చర్చించుకుంటున్నారు.

వినాయక ఉత్సవాల్లో మొదలైన సందడి

గ్రామ పంచాయతీ ఎన్నికలు అక్టోబరులో మొదలయ్యే అవకాశాలు కనిపిస్తుండడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. పల్లెల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలు, పండుగల సందర్భంగా అధికార పార్టీ శ్రేణులతోపాటు ఆశావహులు సందడి చేస్తున్నారు. ప్రస్తుతం వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పల్లె పోరు సందడి కనిపిస్తోంది. కుల సంఘాలు, యువజన సంఘాలను ఆశావహులు ఆకట్టుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే వినాయక విగ్రహాలు అందించడంతోపాటు ఉత్సవాలకు సంబంధించిన ఖర్చులు భరిస్తున్నారు.

కలెక్టరేట్‌లో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లకలెక్టరేట్, సెప్టెంబరు 11 : కలెక్టరేట్‌లో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. కలెక్టరేట్ మొదటి అంతస్తులో ఎల్ఆర్ఎస్-2020పై ఏర్పాటు చేసిన ఫిర్యాదుల కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికార, అనధికార లేఅవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం జిల్లా ప్రజలు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని, ఫిర్యాదులకు 18002331495 టోల్ ఫ్రీ నంబరు అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఫిర్యాదులు, సలహాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ అన్సారీ, తదితరులు పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకంతో లాభాలు



మల్బరీ తోటను పరిశీలిస్తున్న జిల్లా అధికారి లత

ముస్తాబాద్, సెప్టెంబర్ 11 : పట్టు పురుగుల పెంపకంతో రైతులు లాభాలు గడిస్తారని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి లత అన్నారు. మండలంలోని నామాపూర్ శివారులో మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి లత మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఏడాదిలో 8 నుంచి పది పంటలు వేసుకోవచ్చన్నారు. ఎస్సీ ఎస్టీలకు సబ్సిడీ పట్టు పరిశ్రమల కోసం సబ్సిడీ ఉందని, బీసీలకు సైతం సబ్సిడీపై ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు. రైతులు ముందుకొచ్చి పట్టు పురుగుల పెంపకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ జిల్లా అధికారి జగన్‌రావు, హార్టికల్చర్ అధికారి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రుద్రంగి, సెప్టెంబరు 11: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రుద్రంగి మండలం మానాల ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించనున్న మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చెత్త కంపు.. ఏదీ పట్టింపు



పేరుకుపోయిన చెత్తాచెదారం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 11: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ లోని ప్రధాన రహదారి పక్కన చెత్తాచెదారం పేరుకుపోయింది. మురుగు నీటి కాల్వ నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అధికార గణం నిద్రపోతోంది. ఫలితంగా జనం జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, చెత్తను తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఆధునిక సాంకేతికతతో నేరాల నియంత్రణ

- పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, సెప్టెంబర్ 11 : ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకొని నేరాలను నియంత్రించేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో రెనోవేషన్ చేసిన పోలీసు విశ్రాంతి భవనాన్ని, సీసీ కెమెరాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్పీ అఖిల్ మహాజన్ నేతృత్వంలో పోలీసు శాఖ వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగడం అభినందనీయమన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం పోలీసింగ్ విధానంలో అనేక మార్పులు వచ్చాయని, అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని నేరాల నియంత్రిస్తూ నిరంతరం సమాజ సేవ చేస్తున్నారని కొనియాడారు.జిల్లా కేంద్రంలో నిర్మించిన జిల్లా పోలీస్ కార్యాలయాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోందన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ 24 గంటలపాటు విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమం దృష్టిలో పెట్టుకొని విశ్రాంతి భవనాన్ని ఏర్పాటు చేశామన్నారు. మరింత సమర్థవంతంగా పని చేయాలన్నారు. వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణంలో త్వరలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తామని, క్రమశిక్షణతో పాటించాలని కోరారు. ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్సై అంజయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎస్పీ

స్త్రీనిధి రుణాల రికవరీలో వేగం పెంచాలి

- ఇందిరా మహిళా శక్తిపై అవగాహన కల్పించాలి - వీడియో కాన్ఫరెన్స్‌లో సెర్ప్ కమిషనర్ దివ్యదేవరాజన్



వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 11: స్వశక్తి సంఘాల మహిళలకు అందించిన స్త్రీనిధి రుణాలను సకాలంలో రికవరీ చేసేందుకు వేగం పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి పథకంపై అవగాహన కల్పించాలని సెర్ప్ కమిషనర్ దివ్యదేవరాజన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాలకు అందించే పాడి గేదెలు, కోడి పిల్లల పెంపకం, రిటేల్ చేపల విక్రయం వంటి పథకాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో చేపట్టిన కార్యక్రమాల వివరాలను దివ్యదేవరాజన్ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దివ్యదేవరాజన్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకాల కోసం మహిళ సంఘాల నుంచి దరఖాస్తుల స్వీకరణ, వాటికి కావాల్సిన పత్రాలు, లబ్ధిదారుల ఎంపిక, గ్రౌండింగ్, బ్యాంక్ రుణాలపై అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంఘాల బాధ్యులకు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ చేయించడంపై దృష్టి సారించాలన్నారు. జిల్లా మహిళా సమాఖ్య భవనాలు లేనిచోట స్థలాలను గుర్తించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీవో శేషాద్రి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో డీపీఎం పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈవో

బోయినపల్లి, సెప్టెంబరు 11: విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచేలా ప్రతీ ఉపాధ్యాయుడు బోధించాలని డీఈవో రమేష్ కుమార్ అన్నారు. బుధవారం బోయినపల్లి మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న న్యాస్ శిక్షణ తరగతులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేలా పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యాబోధన ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్వహించే వివిధ శిక్షణ తరగతులకు ఉపాధ్యాయులు హాజరుకావాలని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో దీక్షితులు శ్రీనివాస్, ఎంఎన్‌వో శ్రవణ్ కుమార్, హెచ్‌ఎం శ్రీనివాస్, గడదాసు సత్యనారాయణ ఉన్నారు.

బోరు మోటారుకు మరమ్మతు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



మోటారు బిగిస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 11: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రెండో వార్డులో కాలిపోయిన బోరు మోటారుకు అధికారులు బుధవారం మరమ్మతు చేయించారు. బోరు కాలిపోవడంతో కాలనీ వాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఈ నెల 11న 'కాలిపోయిన బోరు మోటారు.. అందని తాగు నీరు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ స్పందించారు. బోరుమోటారుకు మరమ్మతు చేయించి బిగించారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మూలవాగు బఫర్ జోన్‌కు హద్దులు





వేములవాడ రెండో బైపాస్ రోడ్డు మూలవాగు పరిసరాల్లో సర్వే చేస్తున్న అధికారులు

- రెండో బైపాస్ రోడ్డులో సర్వే

వేములవాడ, సెప్టెంబరు 11: చెరువులు, కుంటలు, వాగుల ఆక్రమణలను తొలగించేందుకు హైదరాబాద్ మహానగరంలో హైడ్రా పేరుతో చర్యలు ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జిల్లాల్లోనూ అదే తరహా కార్యకలాపాలను అమలు చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో బుధవారం వేములవాడ పట్టణ మూలవాగు పరివాహక ప్రాంతంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. మూలవాగు పరి వాహక ప్రాంతంలోని మొదటి బైపాస్ రహ దారిలో బఫర్‌జోన్ హద్దులను నిర్ణయించి ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. మరోసారి రెండో బైపాస్ రహదారి ఆనుకొని ఉన్న మూలవాగు పరివాహక ప్రాంతంలోనూ అధికారులు సర్వే నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అధికారులు మూలవాగు బఫర్ జోన్ హద్దులు నిర్ణయించేందుకు బుధవారం సర్వే నిర్వహించారు. సుమారు రెండు కిలోమీటర్ల పొడవు ఉన్న వాగు వెంట అధికారులు సర్వే చేస్తూ హద్దులు ఏర్పాటు చేయడంలో నిమగ్న మయ్యారు. ఈ క్రమంలో మూలవాగు వెంబడి దాదాపు 40 కట్టడాలు నిబంధనలను అతిక్రమించి నిర్మించినట్లు గుర్తించినట్టుగా సమాచారం. రెండు రోజుల్లో హద్దులను ఏర్పాటు చేసి బఫర్ జోన్ హద్దులను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. వేములవాడ ఆర్డీఓ రాజేశ్వర్, జిల్లా ఇన్చార్జ్ ఏడి సర్వేయర్ వినయ్, డిఇ బాలచంద్రం, ఇరిగేషన్ డిఈ శ్రీనివాస్, సంపత్ తదితరులు సర్వే నిర్వహించిన అధికారుల బృందంలో ఉన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఆర్బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

కొడిమ్యాల, సెప్టెంబరు 11: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలను ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్ తెలిపారు. మండలంలోని పూడూర్‌లో బుధవారం ఎఫ్ఎల్సీ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ స్థాపించి 90 సంవత్సరాల్లో అడుగు పెడుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. క్విజ్ పోటీలు జిల్లాస్థాయిలో ఆన్‌లైన్‌లో ఉంటాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారన్నారు. విజేతలైనవారు లక్ష రూపాయల నుంచి 10 లక్షల రూపాయల వరకు గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఒక కళాశాల నుంచి ఎంత మంది విద్యార్థులైనా పాల్గొనటానికి అవకాశం ఉందన్నారు. ఒక బృందంలో ఇద్దరు సభ్యులు ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 17లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఆర్బీఐ 90క్విజ్.ఇన్‌వెబ్‌సైట్ లాగిన్ అయి నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న మధుసూదన్

మిస్సింగ్ కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 11: సిరిసిల్ల పట్టణంలోని గణేశ్ నగర్‌కు చెందిన దాట్ల సుశాంక్ అనే ఇంటర్ విద్యార్థి అదృశ్యమైనట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. మంగళవారం ఎవరికీ చెప్పకుండా ఇంట్లోనుంచి వెళ్లిపోయాడని తల్లి రచన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

● సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన కోడం గంగాధర్ (53) అనే బీడీ టేకేదారు అదృశ్యమైనట్లు తెలిపారు. ఈ నెల 1వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన గంగాధర్ తిరిగి రాలేదని అతడి కుమారుడు ప్రేమ్‌సాగర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎస్‌యూ డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 11: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఏప్రిల్, జూన్-2024లో నిర్వహించిన డిగ్రీ (సీబీసీఎస్, రెగ్యులర్ బ్యాక్‌లాగ్)2, 4, 6వ సెమిస్టర్ రీవాల్యుయేషన్ పరీక్షల ఫలితాలను బుధవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గంజాయి మొక్క సాగుపై కేసు

గంగాధర, సెప్టెంబరు 11: గంగాధర మండలం వెంకంపల్లి పరిధిలో బుధవారం గంజాయి మొక్కను గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని పౌల్ట్రీ ఫాం షెడ్డులో పనిచేస్తున్న ఇతర రాష్ట్ర కూలీలలు గత కొద్ది కాలంగా గంజాయి మొక్కను సాగు చేస్తున్నారు. పక్కా సమాచారం మేరకు పౌల్ట్రీలో తనిఖీలు నిర్వహించగా గంజాయి చెట్టును గుర్తించినట్లు తెలిపారు. వ్యవసాధికారులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మీడియా పేరుతో అక్రమాలు

● మహిళ అరెస్ట్

వేములవాడ, సెప్టెంబర్ 11: మీడియా పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న వేములవాడ మండలంలోని చింతల్‌ఠాణా గ్రామానికి చెందిన చొక్కారావు వనజ అనే మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వేములవాడ ఏఎస్‌పి శేషాద్రినిరెడ్డి తెలిపారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను బుధవారం వివరించారు. వనజ కొంతకాలంగా తాను ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్నానని గ్రామాల్లోని యువతకు మోసపూరితమైన మాటలు చెప్పి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారని చెప్పారు. మీడియాలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తానని, అక్రిడిటేషన్ కార్డులు ఇప్పించడమే కాకుండా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ప్లాట్లు, ప్రభుత్వ అసైన్డ్ భూములను కూడా ఇప్పిస్తానని మోసాలకు పాల్పడుతుందని చెప్పారు. ఇందులో భాగంగానే 2019 సంవత్సరంలో చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన చంద్రయ్య అనే వ్యక్తి నుంచి 16 లక్షల రూపాయలు, రాముస్నపేటకు చెందిన రైతు అరుట్ల ఆది మల్లయ్యకు మూడు ఎకరాల వ్యవసాయ భూమిని తంగళ్లపల్లి మండలం అరంపల్లి వద్ద ఇప్పిస్తానని నమ్మించి పది లక్షల రూపాయలను తీసుకొని మోసానికి పాల్పడింది. మోసాలకు పాల్పడుతున్న వనజకు సహకరించిన మల్యాల గ్రామానికి చెందిన పీసరి శ్రీనివాస్, వనజలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ఏటా తప్పని ప్రయాణ తిప్పలు

● జవారిపేటలో వర్షాకాలం ఇబ్బందులు ● హామీలకే పరిమితమైన వంతెన నిర్మాణం

ఇల్లంతకుంట సెప్టెంబరు 11: భారీవర్షం కురిసిందంటే తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో ఇబ్బంది పడటం జవారిపేట గ్రామవాసులకు సర్వసాధారణంగా మారిపోయింది. జవారిపేట, నర్సక్కపేట గ్రామాలలోని బిక్కవాగుపై ఉన్న లోలెవల్ వంతెన నాలుగు సంవత్సరాల క్రితం కురిసిన భారీవర్షాలతో కొట్టుకుపోయింది. కొట్టుకుపోయిన వంతెన ప్రాంతంలో పైపులు వేసి తాత్కాలిక రోడ్డు వేశారు. ప్రతి సంవత్సరం వర్షాలకు తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోతోంది. దీనితో గ్రామానికి ఆర్టీసీ బస్సులు నిలిచిపోతాయి. అనేక మంది విద్యార్థులు, వ్యాపారస్తులు ప్రతి రోజు నర్సక్కపేట గ్రామం వరకు నడిచివచ్చి బస్సులు ఎక్కి కరీంనగర్ వెలుతుంటారు. గత సంవత్సరం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని శిలాఫలకం వేశారు. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. శిలాఫలకం మాత్రం ధ్వంసం అయింది. దీనిపై ఏతి కిరణ్‌ను వివరణ కోరగా లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన కావాలని కోరడంతో ఆలస్యం జరిగిందన్నారు.



తెగిపోయిన జవారిపేట, నర్సక్కపేట గ్రామాల మధ్యలోని రోడ్డు

హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలి

● ఎ కిరణ్, జవారిపేట



జవారిపేట, నర్సక్కపేట గ్రామాల మధ్యలోని బిక్కవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలి. ఇక్కడ వాగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ప్రతి సంవత్సరం వర్షాలకు కొట్టుకుపోవడం సాధారణంగా మారింది. గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను ప్రజాప్రతినిధుల దృష్టికి అనేక సార్లు తీసుకెళ్లాం.

మంత్రి దృష్టికి తీసుకెళ్లాం..

- డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే



గత ప్రభుత్వ వైఫల్యం వల్లనే జవారిపేట గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. శిలాఫలకం వేసిన వారు పనులు ఎందుకు ప్రారంభించలేదు. ప్రస్తుతం హైలెవల్ వంతెన నిర్మాణం కోసం ఎస్టిమేషన్లు వేసి రాష్ట్రమంత్రి దృష్టికి తీసుకుపోయాం. త్వరలోనే నిధులు మంజూరు చేయించి, పనులు ప్రారంభిస్తాం.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురికి జైలు

వేములవాడ, సెప్టెంబర్ 11: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులకు వేములవాడ న్యాయస్థానం జైలు శిక్ష విధించిందని పట్టణ సీఐ వీరప్రసాద్ బుధవారం తెలిపారు. 2016 సంవత్సరంలో జాతర గ్రౌండ్ వద్ద విధులు నిర్వహిస్తున్న శ్రీకర్ అనే కానిస్టేబుల్ ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణిస్తుండడం గమనించి వారిని ఆపి తనిఖీ చేయడానికి ప్రయత్నించగా ర్యాష్ డ్రైవింగ్‌తో పాటు కానిస్టేబుల్‌పై దాడి చేసి గాయపరిచిన ఎండి రహీముద్దీన్, కూనం మధు, సంటి మహేశ్ అనే వ్యక్తులపై కేసు నమోదు అయిందని తెలిపారు. దీనిపై న్యాయస్థానంలో విచారణ జరిపిన న్యాయమూర్తి జ్యోతిర్మయి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు.

బాకీ చెల్లించలేదని రైతుపై దాడి

ముత్తారం, సెప్టెంబరు 11: బాకీ తీర్చలేదని రైతుపై ఫర్టిలైజర్ షాపు యజమాని బుధవారం దాడి చేసి గాయపరిచాడు. మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన నిమ్మతి శ్రీనివాస్ అనే రైతు అదే గ్రామానికి చెందిన పరికివండ్ల విద్యాసాగర్‌కు చెందిన ఫర్టిలైజర్ షాప్‌లో పత్తి, వరి పొలానికి ఎరువులు కొనుగోలు చేశాడు. ఇందుకు సుమారు 20వేల రూపాయలు బాకీ ఉన్నాడు. బాకీ చెల్లింపులో జాప్యం చేస్తున్నావంటూ రైతు శ్రీనివాస్‌పై మండల కేంద్రంలోని కానర్లగడ్డ వద్ద షాపు యజమాని విద్యాసాగర్ కర్రతో తల, చేతులపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై నరేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య

సుల్తానాబాద్, సెప్టెంబరు 11 : సుల్తానాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కల్వల సుదర్శన్(57) అనే వ్యక్తి పదిరోజుల క్రితం అదృశ్యమయ్యాడు. దీనిపై అతడి భార్య పోలీసులకు సమాచారం అందించింది. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చెందిన క్వార్టర్‌లో సుదర్శన్ ఆత్మహత్య చేసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు మండల పరిషత్ క్వార్టర్ల వద్దకు బుధవారం రాత్రి చేరుకొని చూడగా ఆత్మహత్యకు పాల్పడింది సుదర్శన్ అని గుర్తించారు. పదిరోజుల క్రితమే ఇంటినుంచి వెళ్లిపోయిన సుదర్శన్ అదేరోజు మండల పరిషత్ క్వార్టర్ల వెనుకభాగంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే బుధవారం రాత్రి ఆ ప్రాంతంలో దుర్వాసన రావడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

14న కరీంనగర్ అర్బన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం

● బ్యాంకు అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు11: నగరంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో ఈ నెల 14న ఉదయం 11గంటలకు ది కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు బ్యాంకు అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం బ్యాంకులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు సర్వసభ్య సమావేశానికి సభ్యులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. గత పాలకవర్గం సర్వసభ్య సమావేశాన్ని నామమాత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారని, ఇప్పుడు ఆ విధానానికి స్వస్తిపలికి సభ్యుల, ఖాతాదారుల సాధక బాధకాలను తెలుసుకొని అందరి సమక్షంలో నిర్ణయాలను ఈ సమావేశాల్లో తీసుకుంటామని చెప్పారు. కరీంనగర్ సహకార బ్యాంకుకు కరీంనగర్ మెయిన్ బ్రాంచ్‌తో పాటు జగిత్యాలలో బ్రాంచి ఉందన్నారు. త్వరలోనే గంగాధర ఎక్స్‌రోడ్‌లో నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సమయం తీసుకొని ఆయన చేతుల మీదుగా నూతన బ్రాంచ్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో సభ్యులు మడుపు మోహన్, ముక్క భాస్కర్, విద్యా సాగర్, లక్ష్మణ్‌రాజు, సందీప్, రవీందర్‌రెడ్డి, బ్యాంకు సీఈవో నునుగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కొండగట్టులో బాలుడి కిడ్నాప్ యత్నం

● మహిళను పట్టుకున్న స్థానికులు

మల్యాల, సెప్టెంబరు 11: దిగువ కొండగట్టులో బాలుడి అపహరణకు ఓ మహిళ యత్నించింది. దీంతో గమనించిన స్థానికులు మహిళను పట్టుకుని మల్యాల పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. దిగువ కొండగట్టులో నివాసముంటున్న తులసీ-సాయిక్రిష్ణ కుమారుడు విక్కీ ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. కొండగట్టు గుట్ట పైకి వెళ్లే దారి కావడంతో అటు వైపు వచ్చిన మహిళ బాలుడిని లాక్కొని వేగంగా వెలుతూ అపహరణకు ప్రయత్నించింది. గమనించిన స్థానికులు మహిళను పట్టుకున్నారు. బాబును కుటుంబ సభ్యులకు అప్పగించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మహిళను మల్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించగా విచారణ జరుపుతున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. అయితే ఆ మహిళ తీరును బట్టి చిన్నారులను ఎత్తుకెళ్లే ముఠాగా స్థానికులు అనుమానిస్తున్నారు. సదరు మహిళ బుధవారం మరికొందరు మహిళలతో కొండగట్టుకు వచ్చినట్లు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 11: కరీంనగర్‌లోని కమాన్ నుంచి హౌజింగ్ బోర్డు కాలనీకి వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన స్తంభాన్ని ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి దాసరి చరణ్(21) దుర్మరణం చెందాడు. మారుతీనగర్‌కు చెందిన చరణ్ గచ్చిబౌలిలోని ఒక ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు సెలవుల కారణంగా వారం కిందట కరీంనగర్‌కు వచ్చాడు. మంగళవారం అర్ధరాత్రి చరణ్ స్నేహితుడు ప్రదీప్ ఫోన్ చేసి తనను బస్టాండ్‌లో దించాలని కోరగా చరణ్ తన ద్విచక్ర వాహనంపై దింపాడు. తిరిగి కమాన్ నుంచి మారుతీనగర్‌లోని ఇంటికి బైక్‌పై అతివేగంగా వస్తుండగా భారత్ పెట్రోల్‌బంక్ వద్ద బైక్ అదుపుతప్పి సిమెంట్ పోల్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా వైద్యులు పరీక్షించి మృతి చెందాడని వెల్లడించారు. తన కొడుకు అతివేగంగా బైక్ నడపటంతో అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడని మృతుడి తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు.



దాసరి చరణ్(ఫైల్)

సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థికి పాముకాటు

సుల్తానాబాద్, సెప్టెంబరు 11: సుల్తానాబాద్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బీ మన్విత్ అనే విద్యార్థిని బుధవారం పాము కాటేసింది. తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన మన్విత్ గురుకుల హాస్టల్‌లో ఉంటూ 6వ తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం భోజన సమయంలో మూత్ర విసర్జనకు వెళ్లగా విద్యార్థి మన్విత్‌ను పాము కాటువేసింది. విద్యార్థులు కేకలు వేయడంతో హాస్టల్ సిబ్బంది మన్విత్‌ను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సిబ్బంది పేర్కొన్నారు.

పంట చేలల్లోకి భారీగా వరద నీరు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 11: ఇటీవల కురుసిన భారీ వర్షాలకు వాగులు, చెరువులు, కుంటలు, అలుగులు పారుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి గోదావరి నదికి నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఎస్సారెస్పీ ప్రాజెక్టు ద్వారా నీటిని వరద కాలువలోకి వదలడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు మండలంలోని ఆత్మనగర్ గ్రామ పెద్ద తండా సమీపంలోని వరి పంట చేలల్లోకి భారీగా చేరింది. దీంతో కొన్ని పంట పొలాలు చెరువులను తలపించేలా మారాయి. ప్రధాన ప్రాజెక్టు ఎస్సారెస్పీలోకి పూర్తి స్థాయిలో నీరు చేరుకుంది. దీంతో అధికారులు 19వేల క్యూ సెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మండలంలోని మాన్వార్ వాగు ఇప్పటికే ఉధృతంగా ప్రవహిస్తోంది. మాన్వార్ వాగులోకి వరద కాలువ చేరి మరింత ప్రవాహం పెరిగి నీరంతా వెనకకు రావడంతో ఆత్మనగర్ పెద్దతండా వద్ద జరుపుల పవన్‌నాయక్, శంకర్, రాజేశ్వర్‌లతో పాటు పలువురి రైతులకు చెందిన సుమారు 25 ఎకరాలకు పైగా వరి పంట నీట మునిగాయి. ఇలాగే వరద కాలువ ప్రవాహం కొనసాగితే మరిన్ని పంట పొలాలు నీట మునిగే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు. నీట మునిగి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సాయం అందించాలని కోరుతున్నారు.



ఆత్మనగర్‌లోని వరద కాలువ నీటితో మునిగిన పంట పొలాలు

భార్యకాపురానికి రావడంలేదని ఆత్మహత్య

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 11: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన చిలుకరవి (43) అనే వ్యక్తి తన భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మూడు నెలల క్రితం రవిని వదిలి అతడి భార్య గౌతమి ఇంటినుంచి వెళ్లిపోయింది. దీంతో రవి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో రవి జీవితంపై విరక్తి చెంది తన ఇంటిముందు ఉన్న రేకుల షెడ్డులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు రవి తల్లి అమృత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదివాసీలపై అన్యాయంగా కేసులు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 11: ఆదివాసీలపై పోలీసులు అన్యాయంగా కేసులు పెట్టారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుచిత్ అన్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో ఇటీవల జరిగిన గొడవల్లో అరెస్టు అయిన 10 మందిని కరీంనగర్ జిల్లా జైలులో ఉంచారు. వారితో కుటుంబ సభ్యులు, హైకోర్టు న్యాయవాదులు, బీజేపీ నాయకులు కరీంనగర్ జైలులో బుధవారం ములాఖత్ అయ్యారు. అనంతరం ఆదివాసీలతో కలిసి బీజేపీ నాయకులు కరీంనగర్ జైలు బయట మీడియాతో మాట్లాడారు. గత నెల 31న ఆదివాసీ మహిళ తన సోదరునికి రాఖీ కట్టి ఇంటికి వస్తుండగా ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నించి తీవ్రంగా కొట్టాడన్నారు. ఈ ఘటనను ప్రమాదంగా చిత్రీకరించి నిందితుడు పారిపోయాడని, ఆ తరువాత మహిళ తనకు జరిగిన అన్యాయాన్ని బంధువులకు తెలిపిందన్నారు. నిందితుడు గతంలో ఓ గిరిజన మహిళ భర్తను హత్య చేసి ఆమెను లోబర్చుకున్నాడన్నారు. అదే వ్యక్తి మళ్లీ ఇప్పుడు అఘాయిత్యానికి పాల్పడటంతో గొడవలు చెలరేగాయన్నారు. 10 మంది ఆదివాసీలను అన్యాయంగా



కరీంనగర్ జిల్లా జైలు ఎదుట మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అరెస్టు చేసి జైల్లో పెట్టారన్నారు. జైలులో వారితో మాట్లాడేందుకు వచ్చామని, వారికి బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు.

దినసరి కూలీ అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 11: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌కు చెందిన దినసరి కూలీ ఉత్తర్ల రాజేందర్ అదృశ్యమయ్యాడని, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని రాజేందర్ భార్య రేణుక బుధవారం తెలిపింది. గ్రామంలోని రాజేందర్ నిత్యం కూలీ పనుల కోసం చీర్లవంచ గ్రామానికి వెళ్లి వచ్చేవాడని పేర్కొంది. మూడు నెలల కిందట ఇంటి నుంచి కూలీ పనులకు వెళ్లిన తన భర్త రాజేందర్ ఇంటికి తిరిగి రాలేదని చెప్పింది. చుట్టుపక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొంది.

మూడు నెలలుగా వెతికినా ఆచూకీ లభించలేదని వాపోయింది. గతంలోనూ పలుమార్లు అదృశ్యమై తిరిగి ఇంటికి వచ్చాడని తెలిపింది. తన భర్త అదృశ్యంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానని రేణుక పేర్కొంది.

తృటిలో తప్పిన ప్రమాదం



అర్కండ్ల వాగుపై నీటి ప్రవాహంలో ప్రమాదకరంగా నిలిచిన కారు

శంకరపట్నం, సెప్టెంబరు 11: మండలంలోని అర్కండ్ల బ్రిడ్జిపై కారు అదుపు తప్పి బ్రిడ్జి కిందకి దూసుకెళ్తుండగా డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. కారు అర్కండ్ల లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వెళ్తుండగా నీటి ప్రవాహానికి బ్రిడ్జి కిందకి దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి బ్రేక్ వేయడంతో ముందు టైర బ్రిడ్జి కిందకి జారి కారు ముందు భాగం బ్రిడ్జికి తగిలి అక్కడే ఆగడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో కారులో ఉన్న వారు ఊపిరి పీల్చుకున్నారు.

మల్లన్న సన్నిధిలో సినీ నటుడు శివారెడ్డి పూజలు



మల్లన్నకు పూజలు నిర్వహిస్తున్న శివారెడ్డి

ఓదెల, సెప్టెంబరు 11 : ఓదెల మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి సన్నిధిలో సినీ నటుడు, మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి పూజలు నిర్వహించారు. బుధవారం శివారెడ్డితో పాటు బీజేపీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు రవికాంత్ ప్రదీప్‌కుమార్, ఎన్నారై దుర్గ ప్రసాద్, ప్రముఖ ఆర్టిస్ట్ భాస్కర్, వాసు, కేఎస్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో సుధాకర్, సిబ్బంది వారిని సన్మానించారు.

తెలంగాణ సాయుధ పోరాట అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 11: తెలంగాణ సాయుధ పోరాట అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె వెంకటేశ్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ముకుందలాల్‌మిశ్రా భవన్‌లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. 13న తెలంగాణ చౌక్ నుంచి అనభేరి ప్రభాకర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ, 15న జిల్లా సదస్సు, 17న గ్రామాల్లో సెమినార్లు, సభలు నిర్వహించాలన్నారు. దేశ సంపదను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అమ్మివేస్తోందన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాల మూలంగా నష్టాన్ని జాతీయ విపత్తుగా పరిగణించి నష్టపరిహారం చెల్లించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, సత్యం, భీమా సాహెబ్, సంపత్, ఆశోక్, డినరేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 11: మండలంలోని వేములకుర్తి గ్రామ శివారులోని కీర్తన, శ్రీ కీర్తన పౌల్ట్రీ ఫాంలలో అక్రమంగా నిల్వ ఉంచిన 108 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు దాడులు చేసి బుధవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ శివారులోని రెండు పౌల్ట్రీ ఫాంలలో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్‌తో కలిసి దాడులు నిర్వహించామన్నారు. అక్రమంగా నిల్వ ఉన్న 108 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు తెలిపారు. బియ్యం తరలిస్తున్న టాటా మ్యాజిక్ వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన పౌల్ట్రీ ఫాం యాజమానులు గుజ్జే గంగాధర్, అంకతి రాజలింగం, ఆటో యాజమానులు కొండపల్లి కాంచెట్టి, సద్దుల సతీష్‌పై తో పాటు పరారీలో ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

● మెట్‌పల్లిలో 20 క్వింటాళ్ల బియ్యం సీజ్

మెట్‌పల్లి పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఆటోను పట్టుకుని 20 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మెట్‌పల్లి మండలం వెంపేట గ్రామం నుంచి ఆర్మూర్‌కు అక్రమంగా బియ్యం తరలిస్తుండగా పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఒకరిపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

●తంగళ్లపల్లి: మండలంలోని అంకుసాపూర్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రూరల్ సీఐ మొగిలి తెలిపారు. మంగళవారం



వేములకుర్తిలో పౌల్ట్రీ ఫాంలో బియ్యం పట్టుకున్న సీఐ నిరంజన్‌రెడ్డి

రాత్రి అంకుసాపూర్‌లో బియ్యం తరలిస్తున్నారని సమాచారం మేరకు ఎస్సై సుధాకర్ దాడులు నిర్వహించారని, వ్యాన్‌లో పది క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నారని తెలిపారు. బియ్యం తరలిస్తున్న తంగళ్లపల్లికి చెందిన నడుగు బాలయ్య, కొనుగోలు చేస్తున్న జిల్లెల్ల గ్రామానికి చెందిన పాండుపై కేసు నమోదు చేశామన్నారు.

● వీణవంక: మండలంలోని శ్రీరాములపేటలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నారు. శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామనికి చెందిన అంగిడి సుధాకర్, లోకిని శ్రీనివాస్‌లు గ్రామాల్లో తిరుగుతూ 12 రూపాయల చొప్పున కొని ఇతర ప్రాంతాల్లో 17 రూపాయలకు అమ్ముతున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

భూషణ్‌రావుపేటలో రైతు ఆత్మహత్యాయత్నం

● రుణమాఫీ కాకపోవడంతోనేనని బీఆర్ఎస్ ఆరోపణ



చికిత్స పొందుతున్న రైతును పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాల/కథలాపూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేట గ్రామానికి ఏనుగు సాగర్‌రెడ్డి (46) అనే రైతు బుధవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న సాగర్‌రెడ్డిని కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం కథలాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాగర్‌రెడ్డి ఆరోగ్యం విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. రైతు రుణమాఫీ కాకపోవడంతోనే సాగర్‌రెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. చికిత్స పొందుతున్న సాగర్‌రెడ్డిని బీఆర్ఎస్‌కు చెందిన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ తదితరులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ మాట్లాడుతూ గత నెల 20న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కథలాపూర్‌లో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న సాగర్‌రెడ్డి తనకు రుణమాఫీ కాలేదని ఆవేదన చెందుతూ పురుగుల మందు తాగే ప్రయత్నం చేశాడని వివరించారు. అప్పుడు తాము అడ్డుకున్నామని తెలిపారు. ఇప్పుడు రుణమాఫీ కాలేదని, తనకు అప్పులు మిగిలాయన్న బాధతో రైతు సాగర్‌రెడ్డి ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. రుణమాఫీ జరగకున్నా కనీసం ఆసుపత్రిలో సరియైన వైద్యం సైతం రైతుకు అందించే పరిస్థితి లేదని విమర్శించారు.

కాంగ్రెస్ పాలనలో రైతుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అబద్ధపు పునాదుల మీద రేవంత్‌రెడ్డి పాలన నడుస్తోందని విమర్శించారు. రుణ మాఫీ జరిగిందని సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సాగర్‌రెడ్డి ఆత్మహత్యాయత్నం సంఘటనపై ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శీలం ప్రియాంక ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు ఒల్లం మల్లేశం, నాయకులు దయ్యాల మల్లారెడ్డి, వడిగెల గంగారెడ్డి, హరీశ్, ప్రణయ్, నీలి ప్రతాప్, మణికంఠ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొడుకులు చేరదీయడం లేదని ఠాణాకు చేరుకున్న వృద్ధురాలు

ఇల్లందకుంట, సెప్టెంబరు 11: కుమారులు కూడు పెట్టడం లేదంటూ ఓ తల్లి ఠాణాకు చేరుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మొగుళ్లపల్లి మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన ఉడుత కొమురమ్మకు ఐదుగురు కుమారులు, ఒక కూతురు ఉంది. భర్త సింగరేణి ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన తర్వాత మృతి చెందాడు. కొమురమ్మ సొంత గ్రామమైన పర్లపల్లిలో ఉంటుంది. ఐదుగురు కొడుకులకు గాను ఇద్దరు సింగరేణి ఉద్యోగం చేస్తుండగా, ఒకరు చనిపోయారు. మరో ఇద్దరిలో ఒకరు ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో ఉండగా, మరొక అతను జమ్మికుంటలో ఉంటున్నాడు. కొమురమ్మ బుధవారం సిరిసేడులో ఉంటున్న సదయ్య అనే కుమారుడి వద్దకు చేరుకోగా కోడళ్లు రావద్దంటూ వెళ్లగొట్టారు. దీంతో ఆమె ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా అక్కడ ఉన్న సిబ్బంది కొడుకుకు ఫోన్‌చేసి పిలిపించారు.

సదయ్య ఠాణాకు చేరుకొని సిబ్బందితో మాట్లాడుతూ నేను ఒక్కడినే కాదు ఇంక ముగ్గురు ఉన్నారు. వారు కూడా రావాలని సమాధానం ఇచ్చాడు. ఎస్ఐ రాజకుమార్ వెంటనే కోడళ్లతో మాట్లాడి మీ అత్తమ్మ కొమురమ్మ మీ ఇంటికి వస్తుంది. ఆమెను సాకాలని మిగతా కొడుకులను పిలిపించి మాట్లాడుతానని చెప్పి సిరిసేడులో ఉంటున్న కొడుకు వద్దకు పంపించారు.



పోలీస్‌స్టేషన్‌లో వృద్ధురాలు కొమురమ్మ

మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 11: మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిల్లా ప్రధానకార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. కోడిగుడ్డుకు ప్రభుత్వం రూ.5 చెల్లిస్తోందని, కానీ బహిరంగ మార్కెట్‌లో రూ.7 ఉందని పేర్కొన్నారు. దీంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టోలో పేర్కొన్నట్లు రూ.10 వేల వేతనం ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణ ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వాలనే ఆలోచన విరమించుకోవాలని కోరారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 11: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం ఉపాధ్యాయులు సన్మానించారు. తిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణహరి, స్థానిక ఎంపీపీఎస్ ఉపాధ్యాయిని శోభారాణి, సింగారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎల్లారెడ్డిని సన్మానించారు. హెచ్‌ఎం మనోహరాచారి, ఎస్‌టీయూ నాయకులు గోపి, శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇంటర్ స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం

వేములవాడ, సెప్టెంబరు 11: మానాల తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల కళాశాలలో ఇంటర్మీడియెట్ స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం పలుకుతున్నట్లు ప్రిన్సిపాల్ ప్రతిభ బుధవారం తెలిపారు. ప్రాంతీయ సమన్వయ అధికారి జాను నాయక్ ఆదేశాల మేరకు గురువారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వేములవాడలోని కళాశాలలో బైపీసీలో 40, ఎంపీసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కోరుట్ల బస్టాండ్‌లోని కళాశాలలోగానీ 8333925401లో గానీ సంప్రదించాలని సూచించారు.

మిడ్ మానేరుకు ఇన్ ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 11: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి 13500 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఇందులో అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 316. 41 మీటర్లు ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 23.60 టీఎంసీలకు చేరుకుంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌కు ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 11: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటి ఎత్తిపోలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీ సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.69 టీఎంసీలకు చేరుకున్నాయి. మధ్యమానేరు ద్వారా వచ్చిన 6400 క్యూసెక్కుల నీటిని రెండు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఇల్లంతకుంటలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఇల్లంతకుంట, సెప్టెంబరు 11: మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచనల మేరకు మండల కేంద్రంలో బుధవారం పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గ్రామంలో 127 మంది పారిశుధ్య కార్మికులు పనుల్లో నిమగ్నమయ్యారు. 29 మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు పనులను పర్యవేక్షించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను ఇళ్ల వద్దకు వచ్చే వాహనంలో మాత్రమే వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీవో వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ రథం వితరణ



వైకుంఠ రథాన్ని అందజేస్తున్న మోతె రాములు

చందుర్తి, సెప్టెంబరు 11 : ఉన్న ఊరిపై మమకారంతో చందుర్తికి చెందిన ఎన్నారై మోతె రాములు ముదిరాజ్ తన తండ్రి ఓదెలు జ్ఞాపకార్థం వైకుంఠ రథాన్ని గ్రామ పంచాయతీకి వితరణ చేశారు. బుధవారం గ్రామపంచాయతీ ఆవరణలో ఇన్‌చార్జి ఎంపీడీవో నటరాజ్, తహసీల్దార్ శ్రీనివాస్‌కు వైకుంఠ రథం పత్రాలను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు సిరికొండ శ్రీనివాస్, మార్త సత్తయ్య, పులి సత్తయ్య, గొట్టే ప్రభాకర్, బాసెటి భాస్కర్, బత్తుల కమలాకర్ పాల్గొన్నారు.

సమాజంలోని పరిస్థితులపై దృష్టిసారించాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 11: సమాజంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై కవులు, కళాకారులు దృష్టి నిలపాలని తహసీల్దార్ ఫారూఖ్, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. మండల కేంద్రంలో బుధవారం ఈ బతుకు మాకొద్దు దేవుడా షార్ట్‌ఫిల్మ్ పోస్టర్, ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిపెంచిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో చూసుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యతన్నారు. దర్శకుడు బాలకిషన్ తిప్పరవేణి, గాయకుడు రామంచ తిరుపతి, నటులు బొల్లం కనుకయ్య, కూనబోయిన బాలరాజు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నవరాత్రోత్సవాలు



తంగళ్లపల్లిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



రాచర్లగొల్లపల్లిలో పూజలు చేస్తున్న ఆగయ్య, లక్ష్మణ్‌రావు



రుద్రంగిలో మట్టి గణపతి వద్ద పూజలు చేస్తున్న విద్యార్థులు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 11: వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. తంగళ్లపల్లి మండల కేంద్రంలో డీడీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు. అన్నదానం చేపట్టారు. పద్మనగర్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గణేష్ మండపం వద్ద అన్నదానం చేశారు. బస్వాపూర్‌లో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో అన్నదానాన్ని ఎస్సై సుధాకర్ ప్రారంభించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్, ఆనందం, రవీందర్, కాంగ్రెస్ నాయ కులు ప్రవీణ్, లింగారెడ్డి, మచ్చ శ్రీనివాస్, సత్తు శ్రీనివాస్ రెడ్డి, పత్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుల వద్ద బుధవారం భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, రాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం గర్జనపల్లిలోని హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బుధవారం సామూహిక కుంకుమార్చనలు చేశారు.

చందుర్తి: మండల కేంద్రంతోపాటు లింగంపేట, మల్యాలలోని వినాయక మండపాల వద్ద నాయకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగంపేటలో సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేష్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకుల పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో గణేష్ నవరాత్రుల సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీజే బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.



లింగంపేటలో పూజలు చేస్తున్న అల్లాడి రమేష్

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



బద్దం ఎల్లారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సీపీఐ నాయకులు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 11: తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మండలంలోని గాలిపెల్లిలో బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. బద్దం ఎల్లారెడ్డి స్థూపం వద్ద నివాళులు అర్పించారు. విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడారు. తెలంగాణ నిజాం సర్కార్ మెడలు వంచాలని బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, ముగ్దుం మొయినుద్దీన్ సాయుధ పోరాటానికి పిలుపు నిచ్చారన్నారు. ఈ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టు గెరిల్లాలు అమరత్వం పొందాయని, 300 గ్రామాలకు నిజాం పాలన నుంచి విముక్తి లభించాయని అన్నారు. భూస్వాములు, జమీందారులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వక్రీకరిస్తోందని, హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా పేర్కొంటోందని అన్నారు. ఓట్ల రాజకీయం చేస్తున్న బీజేపీని అన్నివర్గాల ప్రజలు మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ఘనత కమ్యూనిస్టులదేనన్నారు. సిరిసిల్లలో బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతిరెడ్డి కాంస్య విగ్రహాని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17వరకు సాయుధ పోరాట వారోత్సవాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యుడు మంద సుదర్శన్, నాయకుడు కదారి రాములు, మీసం లక్ష్మణ్, వేణు, శ్రావణపెల్లి మల్లేశం, ఏసీరెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మన్, రాజు, బాలయ్య, చంద్రం, బాలనర్సు, బాలమల్లు, బద్దం రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 11: విద్యార్థులు నూన్యతా భావాన్ని వీడాలని సైకాలజిస్ట్ పున్నంచందర్ సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ, తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేజింగ్ దినా రేటిప్ ఆన్ సూసైడ్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పున్నంచందర్ మాట్లాడుతూ చదువుపై దృష్టి సారించడంతోపాటు అధిక సమస్యలు ఉంటే తల్లిదండ్రులు, అధ్యాపకులతో పంచుకోవాలన్నారు. చిన్న విషయాలకు ఎక్కువగా బాధపడడం, అతిగా స్పందించడం వంటివి మానసిక సమస్యలకు దారితీస్తాయన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అలువాల ఈశ్వర్, ప్రిన్సిపాల్ వనజకుమారి, కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ మడుపు నవీన్‌రెడ్డి, ఎం సునీత, అధ్యాపకులు శ్రీనివాస్, ప్రవీణ్, గంగరాజు, అఫ్రోజ్ సుల్తానా, అనిత, డాక్టర్ సంజన పాల్గొన్నారు.

గీత కార్మికులకు సేఫ్టీ కిట్లపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న అధికారులు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 11: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గీత కార్మికులకు సేఫ్టీ కిట్ల వాడకంపై శిక్షణ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం గీత కార్మికులను ప్రమాదాల నుంచి కాపాడాలనే ఉద్దేశంతో కాటమయ్య రక్ష కిట్ల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా బుధవారం గీత కార్మికులకు తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఎల్లమ్మ దేవాలయం వద్ద గౌడ కమ్యూనిటీకి చెందిన కల్లుగీత కార్మికులకు సేఫ్టీ కిట్‌లను ధరించడంపై మ్యాడగొని బుచ్చయ్య గౌడ్, జవ్వాజి ప్రభాకర్, తాళ్లపల్లి తిరుపతి, సదయ్య గౌడ్ శిక్షణ ఇచ్చారు. గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు బండి సత్తయ్యగౌడ్, కరుణాకర్‌గౌడ్, నర్సింగంగౌడ్, రామగౌడ్, సుద్దాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలికలను వేధిస్తే సమాచారం ఇవ్వాలి

చందుర్తి, సెప్టెంబరు 11: బాలికలను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పీసీం ఏఎస్సైలు ప్రమీల, ప్రియాంక అన్నారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పీసీం ఆధ్వర్యంలో బాలల లైంగిక వేధింపులపై చందుర్తి మండలంలోని సనుగుల, లింగంపేట, ఎనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలల హక్కులు, పోక్సో చట్టం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఎవరైనా అమ్మాయిలను వేధింపులకు గురి చేస్తే 100 లేదా 1098 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఏఎస్సై బాపు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శంకరమ్మ, ఐసీపీఎస్ విజయ్ కుమార్, చైల్డ్ లైన్ సూపర్‌వైజర్ రేణుక పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా



మల్లెగుట్ట ప్రాంతంలో చదును చేసిన భూమి

చందుర్తి, సెప్టెంబరు 11 : మండలంలో ప్రభుత్వ భూ ములు కబ్జాకు గురవుతున్నాయి. మండలంలోని మల్యాల, కట్టలింగంపేట, లింగంపేట సనుగుల, రామారావుపల్లి, జోగాపూర్ గ్రామాల సరిహద్దులో కొంత భూమి మల్లెగుట్ట ఆక్రమణలకు గురవుతోంది. సర్వే నంబరు 588లో 31 ఎకరాల 20 గుంటలు ఉండగా 14 ఎకరాల 20 గుంటల భూమికి కొందరికీ పట్టాలు ఇచ్చారు. 17 ఎకరాల వరకు మిగులు భూమి ఉంది. సర్వే నంబరు 94లో 84 ఎకరాల 15 గుంటల భూమి ఉండగా 19 ఎకరాల 16 గుంటల భూమికి పట్టాలు కొందరికి ఇవ్వగా 64 ఎకరాల 39 గుంటల భూమి ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొందరు అక్రమార్కులు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని, ఇటీవల గుట్ట ప్రాంతంలో చెట్లను నరికి భూమిని చదును చేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. భూప్రక్షాళన వివరాలను పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ల శాఖ అనుసంధానం కాకపోవడంతో భూములు కబ్జాదారుల చేతుల్లోకి పోతున్నాయని పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని అయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు

- శ్రీనివాస్, తహసీల్దార్, చందుర్తి



మల్యాల-లింగంపేట గ్రామాల శివారులోని సర్వే నంబర్లు 588, 94లో భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం. ఆ భూములను స్వాధీనం చేసుకుంటాం. భూముల్లోకి వెళ్లవద్దని హెచ్చరిస్తున్నాం.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై, ననాయకులు

ముస్తాబాద్, సెప్టెంబరు 11: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని, క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని ముస్తాబాద్ మండల మాజీ జడ్పీటీసీ గుండం నర్సయ్య అన్నారు. మండలంలోని పోతుగల్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఎస్‌జీ ఎఫ్ క్రీడలను ఎస్సై గణేశ్‌తో కలిసి ప్రారంభించారు. రెండు రోజుల క్రీడోత్సవాల్లో భాగంగా మొదటి రోజు అండర్ 14-17 విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. మండలంలోని 11 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుంచి 22 టీంలు పోటీల్లో పాల్గొన్నట్లు, విజేతలను జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మండల నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం రాధాకిషన్, మాజీ సర్పంచ్ ఒరగంటి తిరుపతి, పెద్దిగారి శ్రీనివాస్, గజ్జెల రాజు, రంజాని నరేశ్, తలారి నర్సింలు, ఉచ్చిడి బాల్‌రెడ్డి, అరుట్ల మహేశ్‌రెడ్డి, గంత రాజు పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: విద్యార్థులు ఆటలపై ఆసక్తి పెంచుకోవాలని నోడల్ ఆఫీసర్ శ్రీనివాసగౌడ్ అన్నారు. మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో బుధవారం ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటలపై దృష్టి నిలపాలని సూచించారు. క్రీడాకారులకు సమాజంలో మంచి గౌరవం లభిస్తుందన్నారు. క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యాయని తెలిపారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారిని జిల్లాస్థాయికి పంపిస్తామన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్ర శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయిని పావనితోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడ పోటీలను ఎంఈవో రఘుపతి, ప్రధానోపాధ్యాయుడు శంకర్ నారాయణ ప్రారంభించారు.

గంభీరావుపేట: గంభీరావుపేట కేజీ టు పీజీ క్రీడా ప్రాంగణంలో ఎస్‌జీఎఫ్ బాలికల క్రీడాపోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హనుమాండ్లు, పట్టణ అధ్యక్షుడు పాపాగారి రాజుగౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ శంకర్, నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోనరావుపేట ఎస్సై రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని నిజామాబాద్ గ్రామంలో బుధవారం ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలో మంచి మార్గాన్ని ఎంచుకోవాలని, లక్ష్యం దిశగా పయనించాలని సూచించారు. క్రీడల్లో కూడా రాణిస్తే మంచి భవిష్యత్ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దూస రఘుపతి, హెచ్‌ఎం షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై ఇంటింటా సర్వే

వీర్నపల్లి, సెప్టెంబరు 11: ఓటరు నమోదులో తప్పొప్పులను సవరించేందుకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతిరెడ్డి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు కంచర్లలో సిబ్బంది నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఓటరు నమోదు ప్రక్రియపై ప్రభుత్వం గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. పేరులో మార్పులు చేర్పులు ఉన్నా సవరించుకోవాలనానరు. ఆయన వెంట ఆర్‌ఐ ప్రవీణ్ ఉన్నారు.

టీ షర్టుల పంపిణీ

వీర్నపల్లి, సెప్టెంబరు 11: వీర్నపల్లి మండలం మద్దిమల్ల ప్రభుత్వ పాఠశాలలో చదివే 30 మంది విద్యార్థులకు మాస్టర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం టీ షర్టులను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. యూత్ అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ టీఎస్ కార్యవర్గం

ముస్తాబాద్, సెప్టెంబరు 11: టీఎస్ పీఆర్టీయూ ముస్తాబాద్ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గుమ్మడి బాలకిషన్, ప్రధాన కార్యదర్శిగా లచ్చిగారి శివశంకర్, మహిళా ఉపాధ్య క్షురాలిగా పండుగ పద్మ, కార్యదర్శిగా కీసర స్వామి ఏక గ్రీవంగా ఎన్నిక య్యారు. ఎర్ర ప్రవీణ్‌కుమార్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి



ఎల్లారెడ్డిపేటలో ఆందోళన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 11: ఎస్సీ ఎస్టీ వర్గీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలోని నాయకులు బుధవారం ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. వర్గీకరణతో నష్టం జరిగే అవకాశాలున్నాయన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సమన్యాయం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం తహసీల్దార్ రామచంద్రంకు వినతి పత్రం అందజేశారు. నాయకులు రామచంద్రం, రాజ్‌కుమార్, సందీప్, నర్సయ్య, అనిల్, అంజయ్య, సూర్యం, సురేందర్, రాజు, రవి, నర్సింలు, ప్రసాద్, యాదగిరి, రామస్వామి, రవీందర్, నరేశ్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ముస్తాబాద్ మండల మాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాల మహానాడు సంఘం నాయకులంతా కలిసి వర్గీకరణకు వ్యతిరేకంగా నినదించారు. ఢిల్లీలో మాయావతి చేస్తున్న దీక్షకు మద్దతు తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో మాల సామాజిక వర్గానికి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఐక్య వేదిక అధ్యక్షులు భూమరాజు, బత్తుల భాస్కర్, రాజనర్సు యారటి కరుణాకర్, రాములు, దేవరాజు, రమేశ్, కిషన్, రాంచంద్రం, లక్ష్మణ్, భూమయ్య శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాలలో అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం మాల మహానాడు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసెల చంద్రం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, సూచనలను అన్ని రాష్ట్రాల మెజారిటీ దళితులు, గిరిజనులు పార్లమెంటు సభ్యులు, అంబేద్కర్ యువజన సంఘాలు, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా, బీఎస్పీ, సమాజ్వాది పార్టీ, లోక్ జనశక్తి పార్టీ, సమతా సైనిక్ దళ్ వ్యతిరేకిస్తున్నారన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు నిద్రపోమ న్నా రు. గ్రామ అధ్యక్షుడు బండి రాజు, నాయకులు గొర్రె కిషో ర్ రాగుల మహేందర్ జిల్లా అధికార ప్రతినిధి రఘు, రాజశేఖర్, రాకేష్, దోసల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వేములవాడ, సెప్టెంబరు 11 : గణేష్ మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అగ్నిమాపక అధికారి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు వినాయక మండపాలను సందర్శిస్తూ అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దోమల నివారణకు చర్యలు

వీర్నపల్లి, సెప్టెంబరు 11: ప్రభుత్వ హాస్టళ్లలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి భూక్య మోహన్ నాయక్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ హాస్టళ్లో బుధవారం దోమల స్ప్రే చేయించారు. ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదివే విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



సిరిసిల్ల మున్సిపల్ ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 11: తంగళ్లపల్లి మండలం మండుపెల్లి కేసీఆర్ నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీ మహిళలు డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీని ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. దాదాపు వేయి కుటుంబాలు నివసిస్తున్నాయని, నీళ్ల రాక వీధిలైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక తాగడానికి కూడా నీరు లేదన్నారు. అవసరమైతే మున్సిపల్‌కు ఇంటి పన్ను, నల్లా పన్నులు చెల్లించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న సీపీఎం నాయకులు మహిళలనడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్‌ను కలసి సమస్యలను వివరించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ మున్సిపల్‌లో డబ్బులు లేకపోవడంతో కేసీఆర్‌నగర్‌లో సెప్టెంబరు 1 నుంచి పారిశుధ్య పనులకు మున్సిపల్ బాధ్యత వహించకూడదని కౌన్సిల్ తీర్మానం చేసిందని చెప్పారన్నారు. సెప్టెంబరు 1 నుంచి కేసీఆర్‌నగర్ మౌలిక సదుపాయాల విషయంలో తమకు సంబంధం లేదనడం సరికాదన్నారు. శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేపడతామన్నారు. సీపీఎం నాయకులు కోడం రమణ, శంకర్, శ్రీధర్, నాగరాజు, భరత్, రాంగోపాల్, కవిత, శైలజా, జయ, అరుణ పాల్గొన్నారు.